క్లుప్తంగా

సీపీఐ సభను విజయవంతం చేయాలి

ఎల్కతుర్తి: బీజేపీ హఠావో..దేశ్‌కీ బచావో అనే నినాదంతో చేపట్టిన సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు సోమవారం హుస్నాబాద్‌లో నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ ముగింపు బహిరంగ సభకు నాయకులు, ప్రజలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, సహాయ కార్యదర్శి శనిగరం రాజ్‌కుమార్, కామెర వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు మర్రి శ్రీనివాస్, నిమ్మల మనోహర్, తండ మొండయ్య, గద్ద రాజనర్సు, కంచర్ల సధానందం, చంద్రమౌళి, తిరుమల, లలిత తదితరులు పాల్గొన్నారు.

కవితకు డాక్టరేట్



ఎల్కతుర్తి: మండల కేంద్రానికి చెందిన మునిగడుప కవితకు డాక్టరేట్ పట్టా లభించింది. కాకతీయ విశ్వవిద్యాలయ సోషియాలజీ విభాగ పరిశోధకురాలు కవితకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య పి.మ ల్లారెడ్డి డాక్టరేట్ ప్రకటించారు. కవిత ఎడ్యుకేషనల్ ప్రోగ్రాం ఆఫ్ ది తెలంగాణ గవర్నమెంట్ ఫర్ ది షెడ్యూల్డ్ ట్రైబ్స్–ఎ స్టడీ అనే అంశం విభాగం విశ్రాంత ఆచార్యులు, వైస్ చాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ పర్యవేక్షణలో పూర్తి చేశారు. డాక్టరేట్ లభించడంతో పలువురు బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

రేపటి నుంచి సీఎం కప్ క్రీడలు ప్రారంభం

నడికూడ : మండల స్థాయి సీఎం కప్ క్రీడలు ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో 15 నుంచి 36 ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులు వారి గ్రామ పంచాయతీల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ కార్యాయానికి ఎదురుగా ఉన్న తెలంగాణ క్రీడా ప్రాంగణంలో పోటీలు నిర్వహించబడును. ఆసక్తిగల క్రీడాకారులు సోమవారం మధ్యాహ్నం 12 గంటల లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

కమలాపూర్ : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అంబాలలోని ఆగ్రోస్‌లో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయాధికారి జాలి లక్ష్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ భూముల్లో భూసారం పెంపొందించుకునేందుకు మండలానికి మొదటి విడతగా 530 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయన్నారు. 30 కిలోలబస్తా ఒక్కంటికి పూర్తి ధర రూ.2,407 అని, అందులో 65 శాతం సబ్సిడీ పోను మిగతా రూ.843 రైతులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీ అందజేసి పీఏసీఎస్‌లో అందజేయాలన్నారు. సోమవారం నుంచి జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తామని ఏఓ తెలిపారు.

విరాళం అందజేత

సంగెం : మండలంలోని ఎల్గూర్‌రంగంపేటలో పునర్ నిర్మితమవుతున్న శివాలయానికి స్థానిక ఎంపీటీసీ బానోత్ పద్మశ్రీనివాస్ దంపతులు రూ.50,116ల విరాళాన్ని కమిటీకి అందజేశారు. సర్పంచ్ పోతుల ప్రభాకర్, ఉప సర్పంచ్ బోనాల కొమురయ్య, లక్ష్మినారాయణ, రమేష్, శ్రీనివాస్ నాయకులు కంది కిషన్, సంబరాజు అజేయ్‌కుమార్, బోనాల శ్రీనివాస్, బోగి రవి, బందెల రమేష్‌బాబు, పసునూటి అశోక్, సురేందర్, అనిల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శించకపోవడం విచారకరం

పరకాల : ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న హైబోతుపల్లి గ్రామ సర్పంచ్ కంచ కుమారస్వామి కుటుంబాన్ని 15 రోజులు అవుతున్నా స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించకపోవడం విచారకరమని వైఎస్సార్‌టీపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆముదాలపల్లి మల్లేషం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో కంఠాత్మకూర్ సర్పంచ్ కొమురయ్య, కామారెడ్డిపల్లె సర్పంచ్ దొమ్మటి ఎల్లస్వామి అనారోగ్యంతో, అదే గ్రామానికి చెందిన ఎంపీటీసీ కంచ వరలక్ష్మీ భర్త కుమారస్వామి రోడ్డు ప్రమాదంలో చనిపోతే వారి కుటుంబానికి మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆర్థికంగా అండగా నిలవటం జరిగిందన్నారు. మాజీ మంత్రి కొండా సురేఖ చొరవతో ఆదుకోవడం జరిగిందన్న ఆయన ఓ యువ సర్పంచ్ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుంటే ఎమ్మెల్యే ధర్మారెడ్డి ఆర్థికంగా ఆదుకోకపోయినా పలుకరించకపోవడంపై తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా హనుమాన్ జయంతి



కమలాపూర్ : మాల విరమణకు వెళ్తున్న హనుమాన్ మాలధారులు

ఆత్మకూరు : మండలంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. మండలంలోని గుడెప్పాడ్‌లో హిందూధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. గుడెప్పాడ్‌లోని హనుమాన్ మందిరం నుంచిఆత్మకూరులోని హనుమాన్ మందిరం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. హనుమాన్, శ్రీరామనామస్మరణతో భక్తులు మార్మోగించారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ఆర్‌ఎస్ఎస్ ప్రతినిధులు ఉప్పునూతుల శంకర్‌జీ, టింగిలికారి సత్యనారాయణ, నాగబండి శివప్రసాద్, వంగాల బుచ్చిరెడ్డి, కందకట్ల విజయ్, శ్రావణ్, రంజిత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. సీఐ కుమార్ బందోబస్తు పర్యవేక్షించారు.

టీటీడీ ఆధ్వర్యంలో...

ఆత్మకూరులోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం ప్రాంగణంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మప్రచారపరిషత్ ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, భజనలు, అభిషేకాలు జరిగాయి. కార్యక్రమంలో అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి, ధార్మికమండలి సభ్యుడు నాగబండి శివప్రసాద్, పరికిరాల వాసు పాల్గొన్నారు.

కమలాపూర్: మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో హనుమాన్ మాలధారులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలతో పాటు స్థానిక విశ్వపతి ఆలయంలో 41 రోజుల పాటు నియమనిష్టలతో అంజన్న దీక్షలో తరించారు. ఇరుముళ్లు కట్టుకుని శ్రీ సువర్చలా సహిత ఆంజనేయస్వామిని, రామాలయంలో శ్రీ సీతారాములను దర్శించుకుని కొండగట్టు, భద్రాచలం, పొన్నూరు, ఇల్లంతకుంట దేవాలయాలకు తరలివెళ్లారు. గ్రామాలు హనుమాన్, రామనామస్మరణతో మార్మోగాయి. మండలంలోని ఉప్పల్‌లో శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో జరిగిన హనుమాన్ జయంతి, ఆలయ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ సతీమణి గెల్లు శ్వేత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ దేవేందర్‌రావు, ఎంపీటీసీ సంపత్‌రావు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజమౌళి, వార్డు సభ్యుడు శ్రీధర్‌రావు, నాయకులు ఉపేందర్, రఘు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : గుడెప్పాడ్‌లో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



పరకాల : పూజలు చేస్తున్న కౌన్సిలర్ పూర్ణాచారి, భక్తులు

పరకాల: మండల కేంద్రంలో హనుమాన్ జయంతి వేడుకలను ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దక్షిణ ముఖాంజనేయస్వామి ఆలయంలో 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కిరణ్‌కుమార్ ఆచార్యులు భక్తులకు అభిషేకాలతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

ఎల్కతుర్తి: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే మకల్కకు మద్దతు ధర లభిస్తుందని ఎంపీపీ మేకల స్వప్న అన్నారు. మండలంలోని కేశవాపూర్, దామెర గ్రామాల్లో విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో మక్కల కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు మక్కలు నల్లబడకుండా తేమశాతం 14 శాతానికి మించకుండా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి క్వింటాకు రూ.1962 మద్దతు ధర చెల్లిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ మునిగడుప శేషగిరి, ఎంపీటీసీలు రజినివెంకన్న, గొర్రె ఆదామ్, డైరెక్టర్లు రాజిరెడ్డి, ముప్పు మహేందర్, కాగితాల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్, కోఆప్షన్ సభ్యుడు కమురోద్దీన్, మాజీ సర్పంచ్ గుండా ప్రతాప్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి కన్వీనర్ పోరెడ్డి రవీందర్‌రెడ్డి, సీఈఓ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీపీ మేకల స్వప్న

విద్యుత్ ప్రమాదంలో వరిపంట దగ్ధం



మంటల్లో కాలిపోయిన ధాన్యం

ఎల్కతుర్తి: లూజ్ విద్యుత్ వైర్లతో ఒకదానికొకటి రాపిడి జరిగి పంటపొలంపై పడడంతో ప్రమాదవశాత్తు ఎకరం వరిపొలం మంటల్లో దగ్ధమైన సంఘటన మండలంలోని వీరనారాయణపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మండ వీరస్వామి రైతుకు చెందిన ఎకరం వరిపొలంలో లూజు తీగల వల్ల ఒకదానికొకటి తగిలి విద్యుత్ మిరుగుల్లు వరిపంటపై పడడంతో చెలరేగిన మంటలతో పంటచేను పూర్తిగా కాలిపోయింది. అలాగే దగ్గు తిరుపతిరావు, పుల్లూరి రవీందర్‌రావులకు చెందిన కొంత మేర వరిపొలం కాలిపోవడంతో పాటు అక్కడే పోసుకున్న వరికుప్పలు మంటల్లో కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల వరకు పంటనష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఈ ప్రమాదంలో జరిగిందని రైతులు ఆరోపించారు.

రైల్వే ట్రాక్ ఏర్పాటును విరమించుకోవాలి



మాట్లాడుతున్న భూములు కోల్పోతున్న రైతులు

ధర్మసాగర్ : మండలంలోని పలు గ్రామాల మీదుగా రైల్వేట్రాక్ ఏర్పాటు చేయడం విరమించుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లాలోని పలు మండలాల పరిధిలోని గ్రామాలు పెద్దపెండ్యాల, రాంపూర్, మడికొండ, ధర్మసాగర్, టేకులగూడెం, ఉనికిచర్ల, దేవన్నపేట తదితర గ్రామాల పరిధిలో భూములు కోల్పోతున్న బాధితులు ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామాల మీదుగా రైల్వేట్రాక్ నిర్మాణం చేయడంతో దాదాపు 100 మంది రైతులు విలువైన భూములు కోల్పోతున్నారని అన్నారు. ఈ క్రమంలో అన్ని విధాలుగా సంబంధిత రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని, ఈ సమస్యను ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చూడాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గురువులు, పూర్వ విద్యార్థులు

ఐనవోలు: పదవతరగతి 1995–96 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఐనవోలులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. 27 ఏళ్ల క్రితం పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఒక్కచోట చేరి ఆత్మీయంగా పలకరించుకున్నారు. అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్య నేర్పిన గురువులకు పాదాభివందనం చేసి శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ముఖ్య అతిథిగా డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు హాజరై ఉన్న ఊరును, కన్నతల్లిని, దేవాలయంలాంటి చదువుకున్న పాఠశాలను మరిచిపోకూడదన్నారు. కార్యక్రమంలో ఆనాటి గు రువులు ప్రభాకర్, జనార్దన్‌రెడ్డి, రాజేందర్, పరిపూర్ణాచారి, కిషన్‌రావు, జ్యోతి పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు పుల్యాల రాజిరెడ్డి, మిద్దెపాక రవీందర్, పాక ఉపేందర్, పొన్నాల రాజు, గడ్డల సురేందర్, కాట బోయిన కుమారస్వామి, శ్రీను, జగదీశ్వర్, రాజు, రాము, కుమారస్వామి, మాధవి, లత, రజిత, రమాదేవి, కళావతి, ఉప సర్పంచ్ అడ్డగూడి సతీష్, శ్రీమల్లికార్జునస్వామి ఆలయ మాజీ చైర్మన్ మునిగాల సమ్మయ్యతో తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

నడికూడ : రోడ్డు ప్రమాదాలకు నివారణ వరంగల్ పోలీస్ కమిషనర్ సీపీ రంగనాథ్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు స్థానిక కిషన్ తెలిపారు. సెక్టార్ ఎస్సైలు ప్రశాంత్‌బాబు, హరికృష్ణ, శివకృష్ణ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలు అయిన కొకొండ క్రాస్ రోడ్డు, ధర్మారం, వెల్లంపల్లి క్రాస్ రోడ్డు పక్కన ఉన్న చెట్ల పొదలను, రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లు కొమ్మలను నరికించారు.



చెట్ల పొదలను తొలగిస్తున్న పోలీసులు

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అరూరి

ఐనవోలు: మండలంలోని పంథిని గ్రామానికి చెందిన ఉప్పరి సాయిబాబు ఇటీవల ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ సోమేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ సదానందం, ముఖ్య నాయకులు ఉన్నారు.



కొమురయ్యను పరామర్శిస్తున్న యాదగిరి

తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి నందనం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బుర్ర కొమురయ్య గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకుడు బొనగాని యాదగిరి గౌడ్ ఆదివారం కొమురయ్యను పరామర్శించారు. పరామర్శించిన వారిలో గౌడ సంఘాల నాయకులు జనగాం శ్రీనివాస్, పులి మోహన్, నకరకంటి మోహన్ తదితరులు ఉన్నారు.

మైనారిటీల సంక్షేమానికి కృషి

దామెర: మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తానని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. దామెర వైస్ ఎంపీపీ ఎండీ.జాకిర్ అలీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ముస్లిం రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (ఎంఆర్‌పీఎఫ్) సభ్యులు ఆయన నివాసంలో కలిశారు. మైనారిటీ కమ్యూనిటీ భవనాలు, రెసిడెన్షియల్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడుతూ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి మైనారిటీలు అండగా నిలువాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మహమ్మద్ అజీజ్, డాక్టర్ రాజేమహ్మద్, నయీముద్దీన్, నన్నేసాహెబ్, ఇంతియాజుద్దీన్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న మైనారిటీ నాయకులు

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

సంగెం : హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సూచించారు. వరంగల్–మహబూబాబాద్ ప్రధాన రహదారిలో సంగెం మండలం కాపులకనిపర్తి వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జిని వానాకాలం ప్రారంభంలోగా పూర్తి చేయాలని ధర్మారెడ్డి అన్నారు. రూ.1.50కోట్లతో నిర్మితమవుతున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయితే వర్షాకాలంలో చెరువు మత్తడి వరద వల్ల ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణాలు సాగించవచ్చని అన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయితే రహదారి వెంట ప్రయాణించే ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలోనే ప్రధాన రహదారులు, మండలాలు, గ్రామాల అనుసంధానం రోడ్లు అభివృద్ధి చెందాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.